క్లుప్తంగా

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు, తక్కశిల, ఇటిక్యాలపాడు గ్రామాల్లో పాఠశాలలను ఎంఈఓ శివప్రసాద్ తనిఖీ చేశారు. మంగళవారం ఇటిక్యాలపాడులోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాన్ని ఎంఈఓ శివప్రసాద్ పరిశీలించారు. తక్కశిల, పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



మానవపాడు: మండలకేంద్రంలో తహసీల్దార్ గా వాహీదా ఖాతున్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. భూ సమస్యలు పరిష్కరించి, ప్రజలకు, రైతులకు ఇబ్బందుల కలుగకుండా చేస్తామన్నారు. తహసీల్దార్‌ను సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ జుబేర్ మొహినొద్దీన్ మల్దకల్ మండలానికి బదిలీపై వెళ్లారు.



కేటీదొడ్డి: తహసీల్దార్‌గా షాహిదాబేగం, సీనియర్ అసిస్టెంట్‌గా వెంకటేశ్వర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన సరితరాణి ఇటీవల గట్టు మండలానికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో అయిజ తహసీల్దార్‌గా పనిచేసిన షాహిదాబేగం ఇక్కడికి వచ్చారు.



మల్దకల్: తహసీల్దార్‌గా జుబేర్ మహముద్దీన్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న హరికృష్ణ రాజోళికి బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో జుబేర్ మహముద్దీన్ వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది బదిలీపై వెళ్తున్న తహసీల్దార్‌కు వీడ్కోలు పలకగా, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జుబేర్ మహముద్దీన్‌కు స్వాగతం పలికారు. మండల ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



కేటీదొడ్డి: బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ సరితరాణిని కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. తహసీల్దార్‌గా పనిచేస్తున్న సరితరాణి గట్టు తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. వారిని డీటీ శివశంకర్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఉదయ్‌కుమార్, రాజు, సిబ్బంది వెంకటేష్‌నాయుడు, కుమార్, గణపతి, భీమన్న ఉన్నారు.

రాజోళి: తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన



హరికృష్ణను మంగళవారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో హరికృష్ణతో పాటు, ఆర్ఐగా రాఘవేంద్రగౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డికి పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. అంతకు ముందు కార్యాలయ సిబ్బంది వారికి శాలువా పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ పాల్గొన్నారు.

ధరూరు: మండల తహసీల్దార్‌గా వెంకటరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. మండల ప్రజలు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులందరు కలిసి సమన్వయంతో పని చేసి ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.



పిల్లల ఎదుగుదలకు చర్యలు తీసుకోవాలి

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో బరువు, ఎత్తు తక్కువున్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రతలు తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి సూచించారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఆమె అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేకాధికారులెక్కడ?

- ప్రజల సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి
- సీసీ రోడ్లు, డ్రెయినేజీల సమస్యలు ఎవరు తీర్చుతారు
- పింఛన్లు, ఉపాధి పనులు, గ్రామ సమస్యలపై సందిగ్ధం



ఉండవెల్లిలో డ్రెయినేజీ శుభ్రం చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి

ఉండవెల్లి: రాజకీయం వేరు, ప్రభుత్వ అధికారులు వేరని ప్రజల తీరు. ప్రస్తుతం రాష్ట్రంలో సర్పంచుల పదవీ కాలం పూర్తయింది. గ్రామాలను స్పెషలాఫీసర్లకు అప్పగించారు. రెండు, మూడు గ్రామాలను అధికారులకు అప్పగించడంతో ఆ గ్రామానికి రోజు వెళ్లాలంటే కష్టం. ఒక్కో గ్రామంలో ఒక్కో సమస్యలు నెలకొంటాయి. రోడ్లు కావాలని, ఇంటి ముందు నీళ్లు చల్లుతున్నారు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని కోరుతుంటారు. ప్రస్తుతం స్పెషలాఫీసర్లకు బాధ్యతలు అప్పగించడంతో గ్రామ ప్రజలు, వృద్ధులు, ఉపాధి కూలీలు అయోమయంలో ఉన్నారు. 16 గ్రామ పంచాయతీలకు గాను కేవలం 6 మంది స్పెషలాఫీసర్లను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉంటే ఆఫీసర్లకు గ్రామంలోని సమస్యలు ఎలా తెలుస్తాయని, సాయంత్రం ప్రజలు ఇంటి వద్ద ఉంటారని పట్టించుకోకుండా వ్యవహరిస్తారా? అని ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల బదులు స్పెషలాఫీసర్లను నియమించారు. ఈ క్రమంలో ఎంపీడీఓలు, తహసీల్దార్లను బదిలీ చేశారు. ప్రస్తుతం మండలంలో ఎంపీడీఓగా అబ్దుల్ జబ్బార్, తహసీల్దార్‌గా సలాముద్దీన్ బాధ్యతలు చేపట్టారు. ఇటిక్యాలపాడుకు జిల్లా అధికారిని ఏర్పాటు చేశారు. గ్రామ సమస్యలు జిల్లా అధికారికి చెబితే సమస్య పరిష్కారం అవుతుందా లేదా అని సతమతమవుతున్నారు.



పుల్లూర్‌లో ఎస్‌బీఎం నిధుల జమపై తనఖీ చేస్తున్న స్పెషలాఫీసర్

మండలానికి 21 రోడ్లు మంజూరు..

మండలంలోని అన్ని గ్రామాలకు ఎస్ఆర్ఈజీఎస్ కింద 21 సీసీరోడ్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. దాదాపు రూ.92 లక్షల విలువైన రోడ్లను మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. మంజూరైన సీసీరోడ్లను గ్రామాల్లో స్పెషలాఫీసర్లకు అప్పగిస్తారా? లేక గుత్తేదారులతో నిర్మిస్తారా? అనేది సందిగ్ధంలో ఉన్నారు. సర్పంచుల కాలంలో సర్పంచులు, లేక కాంట్రాక్టర్ల ద్వారా సీసీ రోడ్లు నిర్మించేవారు. ప్రస్తుతం స్పెషలాఫీసర్లకు ఏ ప్రదేశంలో రోడ్లు లేవని ఎలా తెలుస్తుంది. పంచాయతీ కార్యదర్శులకు అనువుగా ఉన్న వారికి నిర్మిస్తారా, రోడ్లు లేని చోట పరిశీలించి నిర్మిస్తారా? అని ఆలోచనలో గ్రామ నాయకులు ఉన్నారు.

సమయ పాలన లేని స్పెషలాఫీసర్లు..

గ్రామీణ పనులు ఒక ఫొటో, గూగుల్ మ్యాప్‌లో షేరింగ్, ఒక సంతకంలా మారింది స్పెషలాఫీసర్ల తీరు. ప్రతి చిన్న పనిని ఫోన్లోనే పరిష్కరించేస్తున్నారు. ఉన్నతాధికారులకు ఒక్క ఫొటో వేస్తే చాలనుకుంటున్న పరిస్థితి ఉంది. ఉన్నతాధికారుల విజిట్ లేక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కొందరి వాదన. గ్రామంలో సమస్యలను అందరిని అడిగి తెలుసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

స్పెషలాఫీసర్లు ఎవరో తెలియదు..



గ్రామంలో సమస్యలు తెలుసుకోవాలంటే అప్పట్లో సర్పంచులుండేవారు. ప్రస్తుతం పదవీకాలం పూర్తయింది. స్పెషలాఫీసర్లు ఎవరో తెలియడం లేదు. ఎప్పుడు వస్తున్నారో తెలియని పరిస్థితి ఉంది. గ్రామ ప్రజలకు స్పెషలాఫీసర్ గురించి సభలు ఏ ర్పాటు చేసి తెలపాలి.

– వెంకటేష్, మారమునగాల–2

సూచనలిస్తున్నాం..



మండలంలో ప్రస్తుతం స్పెషలాఫీసర్లు సమస్యలను తెలుసుకుని పరిశీలిస్తారు. వాటిని మొత్తం పంచాయతీ కార్యదర్శులే పరిష్కరించాలి. వాటికి తగినట్లు స్పెషలాఫీసర్లు వ్యవహరిస్తారు. పకడ్బందీగా గ్రామాభివృద్ధికి కృషి చేసేలా ఉన్నతాధికారులు సూచనలు అందించారు.

– అబ్దుల్ జబ్బార్, ఎంపీడీఓ ఉండవెల్లి

నేటినుంచి భూలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపాల అలంకరణలో ఆలయ సముదాయం,భూలక్ష్మీ చెన్నకేశవస్వామి

- 22న కల్యాణోత్సవం.. 24న రథోత్సవం
- వేడుకలకు మంత్రాలయ పీఠాధిపతి రాక

గద్వాల: గద్వాల కోటలో వెలసిన భూలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో వారం రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. వేడుకలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. 15 ఏళ్ల క్రితం భూలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ పరిసర ప్రాంతాలు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంత్రాలయ మఠానికి అప్పగించారు. గద్వాల పెద్ద జాతరగా పిలువబడే చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు సమీప ప్రాంతాలతో పాటు కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 21న భూలక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం, 24న అర్ధరాత్రి రథోత్సవం నిర్వహించనున్నారు. లింగంబావిలో తెప్పోత్సవం నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లుచేశారు. పూజా కార్యక్రమాలను మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ శ్రీపాదుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. పెద్ద జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ విచారణకర్త ప్రభాకర్ తెలిపారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సిద్ధప్ప

గద్వాల క్రైం: ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అందరికీ అవగాహన ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సిద్ధప్ప అన్నారు. మంగళవారం పట్టణ సమీపంలోని జమ్మిచేడులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగిక సంబంధాలు, రక్త మార్పిడి, సిరంజీల ద్వారా ఎయిడ్స్ వ్యాపిస్తుందన్నారు. సుఖవ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. గర్భిణులు తప్పనిసరిగా హెచ్ఐవీ నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. మరిన్ని సలహాలకు 1097 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, కృపసాగర్ పాల్గొన్నారు.

తుంగభద్ర బోర్‌వెల్‌లో సిల్టు పనులు



అలంపూర్‌లోని తుంగభద్ర నదిలోని బోర్‌వెల్‌లో సిల్టు తొలగించే పనులు

అలంపూర్: అలంపూర్ మున్సిపాలిటీలోని తుంగభద్ర నదిలో ఉన్న బోర్ వెల్‌లో సిల్టు తొలగించే పనులు మంగళవారం చేపట్టారు. మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. రాబోయే వేసవిలో ఆలాంటి సమయంలో తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ ముందస్తు చర్యల్లో భాగంగా తుంగభద్ర నదిలోని బోర్ వెల్ బావిలో నిండిన సిల్టును ప్రైవేటు కూలీలతో తొలగించే పనులు చేపట్టారు. తుంగభద్ర నదిలోని నీరు అడుగంటడంతో బోర్‌వెల్‌కు దూరంగా నీటి ప్రవాహం వెళ్లింది. వేసవి తీవ్రత అధికమైతే నీటి ప్రవాహం మరింత అడుగంటే ప్రమాదం ఉంది. దీంతో ముందస్తుగా బోర్‌వెల్‌లో సిల్టును తొలగిస్తే వేసవిలో నిరంతరాయంగా నీటి సరఫరా చేయడానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. సిల్టు తొలగించే పనులను మున్సిపల్ ఏఈ మేఘనాథ్ గౌడ్ పరిశీలించారు.

ట్యాంకుల శుభ్రతపై అవగాహన



ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ట్యాంకుల శుభ్రతపై పంచాయతీ కార్మికులకు నీటి పరిశుభ్రత అధికారి రాంభూపాల్ రెడ్డి పలు సూచనలు, సలహాలు చేశారు. మంగళవారం నీటి పరిశుభ్రత అధికారి రాంభూపాల్ రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ హర్షద్, ఎంపీఓ పద్మావతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నీటి సరఫరాలో పాచి ఏర్పడకుండా చూసుకోవాలని, క్లోరినేషన్‌ను తగిన మోతాదు నీటిలో కలపాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అయిజ: మండల కేంద్రంలోని చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్లో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషించి విధులు నిర్వహించారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ మల్లికార్జున్, హెడ్ మాస్టర్ సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

317 జీఓ సమస్యను పరిష్కరించాలి

గట్టు: 317 జీఓ సమస్యను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వివిధ పాఠశాలలో ఉపాధ్యాయు లతో సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గోపాల్, రమేష్, ఉస్సేన్, తదితరులు ఉన్నారు.

బండలాగుడు పోటీలపై కేసు నమోదు

మానవపాడు: మండలంలోని నారాయణపురంలో బాలయోగి శివనారాయణస్వామి జాతర సందర్భంగా మంగళవారం ఆలయప్రాంగణంలో అనుమతి లేకుండా బండలాగుడు పోటీల నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ తిప్పన్న తెలిపారు. ఈ సందర్భంగా బండలాగుడు పోటీలు నిర్వహించరాదని చెప్పినా, వినకుండా ఎద్దుల పోటీలు నిర్వహించిన బోయ నారాయణ, బోయ చిన్న, కొంతమందిపై, పోటీ నిర్వహకులపై కేసు నమోదు చేశాని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బండలాగుడు పోటీలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్రిడ్జి ఎత్తు పెంచాలని రైతుల వినతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రాజోళి: రాజోళి–వడ్డేపల్లి మధ్యలో వెళ్తున్న భారత్ మాల హైవేలో భాగంగా నిర్మిస్తున్న బ్రిడ్జి ఎత్తును పెంచాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. రాజోళిలో వ్యవసాయంపై ఆధారపడిన రైతులు ఎక్కువగా ఉన్నారని, ప్రస్తుతం నిర్మిస్తున్న బ్రిడ్జి నాలుగు మీటర్ల ఎత్తులో ఉందని, దీని వల్ల సుబాబులు, ఇతర పంటలను లారీలో తీసుకెళ్లే క్రమంలో ఇబ్బందులు తప్పవన్నారు. సరిహద్దులో ఉన్న కారణంగా ఏపీ నుంచి కూడా పలు ధాన్యంతో కూడిన వాహనాలు వస్తుంటాయని, వాటిని దృష్టిలో పెట్టుకుని బ్రిడ్జి ఎత్తు ఎనిమిది మీటర్లకు పెంచాలని రైతులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంట్రా ఈఈ శ్రీధర్‌రెడ్డి

ఎర్రవల్లిచౌరస్తా: వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ (ఇంట్రా) ఈఈ శ్రీధర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం ఇటిక్యాల మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి కొరత ఏర్పడకుండా చూడాలన్నారు. నీటిని పూర్తి స్థాయిలో క్లోరినేషన్ చేయడంతో పాటు వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని తెలిపారు. ముఖ్యంగా పైప్‌లైన్ల లీకేజీలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీటి బోర్లకు మరమ్మతులు చేయించి, ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ మహ్మద్ ఆజాద్ మొహినుద్దీన్, ఇంట్రా ఏఈ వంశీ సాగర్, వాటర్‌గ్రిడ్ ఏఈ రమేష్, ఎంపీఓ భాస్కర్, ఎంఈఓ రాజు, పీఆర్ ఏఈ పాండురంగారావు తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అయిజ: పట్టణంలోని తిక్క వీరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 27 నుంచి మార్చి 11 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల బుక్‌లెట్, వాల్‌పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తిక్కవీరేశ్వర స్వామి ఆలయంలో విడుదల చేశారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు చేయాల్సి ఏర్పాట్లు, కార్యాచరణకు సంబంధించిన ప్రణాళికను తయారు చేశారు. సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి లక్ష్మీరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ మధుసూదనరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ గిత్తల దేవరాజు, ఆలయ కమిటీ సభ్యులు జనార్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మహానందిరెడ్డి, వెంకటేష్, అశోక్, మధు పాల్గొన్నారు.

కళాశాల జ్ఞాపకాలు మరువలేనివి



మాట్లాడుతున్న హృదయరాజ్

మానవపాడు: మండల కేంద్రంలోని శ్రీ గంగు వెంకటకృష్ణారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి హృదయరాజ్ హాజరై మాట్లాడారు. కళాశాలలో చదివే విద్యార్థులకు జ్ఞాపకాలు మరవలేని అనుభూతులుగా మిగిలిపోతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి ఇంటర్ స్థాయి నుంచి లక్ష్యాని నిర్దేశించుకోని చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం ఇంటర్, ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ పద్మావతి, లెక్చరర్‌లు వెంకటకృష్ణారెడ్డి, లక్ష్మణరావు, మహేందర్‌గౌడ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు లైబ్రరీ పుస్తకాలు పంపిణీ

గోపాల్‌పేట: విద్యాశాఖ ద్వారా పాఠశాలకు అందించేందుకు వచ్చిన లైబ్రరీ పుస్తకాలను మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ ఆయా పాఠశాలలకు పంపిణీ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు 261 రకాల పుస్తకాలు, ఉన్నత పాఠశాలలకు 120 రకాల పుస్తకాలను ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్లకు అందించారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవి పూజ



అలంపూర్ మాంటిస్సోరిలో సరస్వతీదేవి పూజలో పాల్గొన్న విద్యార్థులు

అలంపూర్: అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవి పూజను నిర్వహించారు. పాఠశాలలో ప్రతి ఏడాది పదో తరగతి పరీక్షల ముందు సరస్వతీదేవి పూజ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నెల 23 నుంచి సీబీఎస్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. అందుకే పదో తరగతి విద్యార్థులతో కలిసి సరస్వతీదేవి పూజ చేసినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి గణపతి పూజ చేయగా అర్చక స్వామి ఆనంద్ శర్మ వేదమంత్రోచ్చారణతో పూజలు చేసినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు పోస్టాఫీస్‌లో అకౌంట్



మాట్లాడుతున్న గోవింద్ నాయక్

గట్టు: మండలంలో ఆరగిద్దలోని మంగళవారం వ్యవసాయధికారుల ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లా వ్య వసాయాధికారి గోవిందు నాయక్ హాజరై మాట్లాడారు. ప్రతిరైతు పోస్ట్ ఆఫీస్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని, పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఇన్స్‌రెన్స్, బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్‌లింక్ చేసుకోవాలన్నారు. అకౌంట్ తీసుకున్న వారికి పీఎం కిసాన్ అమౌంట్ ఈ నెల 22వరకు మాత్రమే ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సంగీత లక్ష్మి, ఎంఏఓ హనుమంతు రెడ్డి, ఏఈఓ తిరుమలేష్ ఉన్నారు.

తాగునీటి సరఫరాపై అవగాహన

మానవపాడు: తాగునీటి సరఫరాపై మిషన్‌భగీరథ ఏఈఈ రాఘవేంద్ర కార్యదర్శులకు, సిబ్బందికి మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాగునీరు క్లోరినేషన్ గురించి, గ్రామాలకు సరఫరా చేసిన అంతర్గత పైపులైన్ లికేజీ గురించి అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.